RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam

# వుదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

సంపుటి : 12 ‖ సంచిక : 155 ‖ ఆదిలాబాద్ ‖ శుక్రవారం, నవంబర్ 08, 2024 ‖ VOODAYAM Telugu Daily ‖ వెల : రూ. 3.00 ‖ పేజీలు : 12

## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేయండి

ఆసిఫాబాద్, నవంబర్ 7(ఎ.ఎం.ఎస్): లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను వెంటనే అందజేయాలని ఎంసీపీఐయు నాయకులు రాజేంద్రప్రసాద్, వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పక్షం రోజులు గడుస్తున్నా రెవెన్యూ అధికారులు పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే సమావేశం పెట్టి అందజేస్తారని సమాధానం చెబుతున్నారని పేర్కొన్నారు.

## పోలీసులు ఆరోగ్య సంరక్షణపై దృష్టిసారించాలి

పినపాక, నవంబర్ 7(ఎ.ఎం.ఎస్): పోలీసు అధికారులు, సిబ్బంది ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధవహించాలని ఎస్పీ బి. రోహిత్ రాజ్ అన్నారు. కొత్తగూడెం సబ్ డివిజన్ ఆధ్వర్యంలో పోలీసు కుటుంబాల సభ్యులకు స్థానిక ఐఎంఏ హాల్లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో విశ్రాంతి లేని జీవితాన్ని గడపాల్సి వస్తుందన్నారు. ఈ క్రమంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం అన్నారు.

## ఆడబిడ్డల ఆకాంక్షలను నెరవేర్చడానికి మహాలక్ష్మీ పథకాన్ని కాంగ్రెస్ ప్రారంభించింది



హైదరాబాద్ : ఆడబిడ్డల ఆకాంక్షలను నెరవేర్చాలన్న సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ మహాలక్ష్మీ పథకాన్ని ప్రకటించిందని సిఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ మహాలక్ష్మీలను చూస్తుంటే ఆ పథకం ఉద్దేశం నెరవేరుతోందన్న విషయం అర్థమవుతోందన్నారు. చాలా సంతోషం ఆ పిల్లలు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని, వారి లక్ష్యాలను చేరాలని సిఎం రేవంత్ ఆకాంక్షించారు. మహాలక్ష్మిపథకాన్ని ఉపయోగించుకొని పిల్లలు గ్రౌండ్‌కు వెళ్లి గేమ్స్ నేర్చుకుంటున్నామని మాధవరపు రమా లక్ష్మి(టిజిఎస్ఆర్టీసీ కండక్టర్) ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డికి ట్వీట్ చేశారు. దీంతోపాటు మహాలక్ష్మి పథకం ఆడపిల్లలు చాలా ధైర్యంగా ముందుకు వెళ్లడానికి ఉపయోగపడుతుందని, మీకు ధన్యవాదాలు సార్ అంటూ వారు బస్సులో దిగిన ఫొటోను సిఎంకు షేర్ చేశారు. దీంతో ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం స్పందించారు.

## జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర

### భారత్ గౌరవ్ "కార్తీక మాస స్పెషల్ " రైలు సికింద్రాబాద్ నుండి ప్రారంభం.



హైదరాబాద్ : పర్యటన తిరువణ్ణామలై (అరుణాచలం), రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి మరియు తంజావూరులను దర్శింపచేస్తుంది.

దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో నడపబడుతున్న భారత్ గౌరవ్ రైళ్లు రైలు వినియోగదారుల నుండి భారీ స్పందనను పొందుతూనే ఉన్నాయి. దివ్య దక్షిణ జ్యోతిర్లింగ సహిత యాత్ర ( కార్తీక మాసం స్పెషల్) టూరిస్ట్ సర్క్యూట్ రైలు ఈరోజు అనగా నవంబర్ 06 ,2024న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి ప్రారంభించబడింది మరియు తమిళనాడు మరియు కేరళ దక్షిణాది రాష్ట్రాల్లోని ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలను దర్శింపచేస్తుంది. ఈ 25 వ భారత్ గౌరవ్ రైలు ప్రయాణాన్ని ఈ రైలు లో ప్రయాణిస్తున్న రైలు యాత్రికులలో ఒకరైన 70 సంవత్సరాల వయస్సు కలిగిన శ్రీ సోమేశ్వర్ సాంగ్ సీనియర్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి జండా ఊపి ప్రారంభించారు. ఐ.ఆర్.సి.టీ.సి గ్రూప్ జనరల్ మేనేజర్ శ్రీ పి. రాజ్ కుమార్ కూడా పాల్గొన్నారు. జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర తొమ్మిది రోజుల పర్యటన తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి రైలు ప్రయాణీకులు/ యాత్రికులు తిరువన్నామలై (అరుణాచలం), రామేశ్వరం, మదురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి మరియు తంజావూరు వంటి ముఖ్యమైన ప్రదేశాలను సందర్శించడానికి గొప్ప అవకాశాన్ని అందిస్తుంది. ముఖ్యంగా, ఈ రైలు తెలంగాణలోని సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్ మరియు ఖమ్మం స్టేషన్లతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు మరియు రేణిగుంట స్టేషన్లలో ప్రయాణికులకు ఎక్కే / దిగే సౌకర్యాన్ని అందిస్తుంది. ఈ రైలు అందించే అపూర్వ అవకాశం కారణంగా రైలు ప్రయాణీకులకు , సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి మాత్రమే కాకుండా, మార్గంలోని స్టేషన్ల నుండి కూడా ప్రయాణీకులు భారత్ గౌరవ్ రైలు సేవలను పొందేందుకు ముందుకు వచ్చారు. రైలు 2 ఎసి, 3 ఎసి మరియు స్లీపర్ మిశ్రమ కూర్పుతో అన్ని వర్గాల ఆదరణను ప్రతిబింబిస్తూ ఎసి మరియు నాన్-ఎసి ప్రయాణీకులకు అవకాశాన్ని అందిస్తుంది. సికింద్రాబాద్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి మాత్రమే కాకుండా, మార్గంలోస్టేషన్ల నుండి కూడా రైలు ప్రయాణికులు ఎసి మరియు నాన్-ఎసి రైలు సేవలను పొందారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ అరుణ్ కుమార్ జైన్ భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలుకు భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలుకు తెలుగు రాష్ట్రాల్లోని ప్రయాణికుల నుంచి నిరంతరం మంచి స్పందన లభిస్తుండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. భారత్ గౌరవ్ రైళ్లు దేశంలో ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి పెద్దపీట వేస్తాయి అని ఆయన పేర్కొన్నారు.

## ఒంటిపూట బడుల నిర్ణయం సరికాదు.

- టీచర్లను కొనసాగించి యధాతథంగా బడులు కొనసాగించాలి.
- పేద విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం.
- యధావిధిగా పాఠశాలలో కొనసాగించాలి.
- ఎస్ ఎఫ్ ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్.

హైద్రాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో కుల గణనా కోసం ప్రభుత్వ టీచర్లను కేటాయించి, ఒక్కపూట పాఠశాల ,తర్వాత సర్వే చేయడం కోసం పాఠశాలలకు పూట సెలవు నిర్ణయం వెనక్కి తీసుకోవాలని, పాఠశాలను యథాతవిధంగా కొనసాగించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను సర్వే విధులను నిర్వర్తించాలని తీసుకున్నటువంటి నిర్ణయం వల్లన పేద విద్యార్థులు విద్యపై తీవ్ర ప్రభావం పడుతుంది అని చదువులకు ఆటంకాలు లేకుండా సర్వే చేపట్టాలని ఎస్ఎఫ్ఐ కోరుతుంది. తెలంగాణ రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలో కొన్ని ప్రాథమిక పాఠశాలలో ఒక్కే టీచర్ రెండు, మూడు సబ్జెక్టులు బోధించే పరిస్థితి ఉంది. ఎకోపాధ్యాయ పాఠశాలలు ఉన్న దగ్గర చదువులు నష్టపోయే అవకాశం ఉంటుంది. ఈ సంవత్సరంలో వర్షాల వల్ల ఎక్కువ రోజులు సెలవులు రావటం వల్ల విద్యార్థులకి ఇప్పటి వరకు పూర్తి కావాల్సినంత సిలబస్ పూర్తి కాలేదని ,ప్రాథమిక విద్యలో ఫౌండేషన్ అత్యంత కీలకం అని ఒంటిపూట బడులు వల్లన తీవ్ర నష్టం పేదవిద్యార్థులకు జరుగుతుంది అని పాఠశాలలను యథాతథంగా కోనసాగించాలని ఎస్ఎఫ్ఐ ప్రభుత్వాని కోరుతుంది. లేదంటే షిఫ్ట్ పద్ధతిలో అయినా రోటేట్ చేసి పూర్తిస్థాయిలో పాఠశాలలు నడపాలని ఎస్ఎఫ్ఐ కోరుతుంది.

STUDY STRUGGLE

SFI

## తెలంగాణలో పలువురు డీఎస్పీ అధికారులు బదిలీ

హైదరాబాద్ నవంబర్ 7 : తెలంగాణలో పలువురు డీఎస్పీ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ ఇవాళ (గురువారం) ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న అధికారి ఎస్ఆర్ దామోదర్ రెడ్డిని అంబర్‌పేట్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ప్రస్తుతం జగిత్యాల డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న జీ మహేశ్ బాబుని కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ఇక కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా ఉన్న బీ.రామానుజంను కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌ఫర్ చేశారు. కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ఉన్న ఏ.కరుణాకర్‌ను అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు. అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా ఉన్న పీ.సదయ్యను బదిలీపై హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని డీజీపీ కోరారు. ప్రస్తుతం వనపర్తి డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న కే.క్రిష్ణ కిశోర్‌ను తొర్రూర్ (మహబుబాబాద్) ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు. ఇక తొర్రూర్ ఎస్‌డీపీవోగా ఉన్న వీ సురేశ్‌ను హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. నిర్మల్ డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న పీ.రవీందర్ రెడ్డిని ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీగా బదిలీ చేశారు. ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీగా ఉన్న డీ.ప్రసన్న కుమార్‌ను మెదక్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌పర్ చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు డీజీపీ ఉత్వర్వులు జారీ చేశారు. కొత్త పోస్టింగ్ ప్రదేశాల్లో తక్షణమే రిపోర్ట్ చేయాలని స్పష్టం చేశారు.



## హ్యాట్సాఫ్ కలెక్టరమ్మ

హైదరాబాద్ : ధాన్యం తేమను గుర్తించే క్రమంలో నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం మునుగోడు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలుకేంద్రాన్ని "పాద రక్షలు వదిలి ధాన్య రాసులపైకి వచ్చి రైతు కష్టం - ధాన్యం విలువ" కు గౌరవాన్ని కల్పించారు.

జగిత్యాల జిల్లా ఐకెపి సెంటర్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీలో భాగంగా బూట్లతో వరి రాసులపైకి ఎక్కిన జగిత్యాల కలెక్టర్ బి.సత్యప్రసాద్.



హైదరాబాద్ : గౌరవనీయ వ్యవసాయ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వర రావు తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న పత్తి కొనుగోలు కార్యకలాపాలపై సమీక్ష సమావేశం సచివాలయంలో మార్కెటింగ్ శాఖ అధికారులతో నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారులను పత్తి కొనుగోలు కేంద్రాల్లో రోజువారీ రాకలను పర్యవేక్షించేలా ఆదేశించారు.

రైతులు తమ పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) కేంద్రాల్లోనే విక్రయించి ఎంఎస్‌పి ప్రయోజనం పొందాలని, సిసిఐ నిర్దేశించిన ఫెయిర్ అవరేజ్ క్వాలిటీ (ఎఫ్ఎక్యూ) ప్రమాణాలు పాటించి అధిక ధర పొందాలని పిలుపునిచ్చారు.

## జాతీయ విద్యా విధానం-2020 ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలి

### ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి - ప్రైవేటు విద్యాసంస్థలను నియంత్రించాలి

### విద్యాకమీషన్ చైర్మన్ ఆకునూరు మురళితో జరిగిన భేటీలో టిఎస్ యుటిఎఫ్

హైదరాబాద్ : పేదలకు విద్యను దూరం చేసే జాతీయ విద్యా విధానం-2020 ని రాష్ట్రంలో అమలు జరపకుండా తిరస్కరించాలని, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసి, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని నియంత్రించాలని టిఎస్ యుటిఎఫ్ కోరింది. గురువారం తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ భేటీ జరిగింది. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, కార్యదర్శులు ఎం రాజశేఖరరెడ్డి, డి సత్యానంద్, పి మాణిక్ రెడ్డి, జె యాకయ్య, నాయకులు గోపాల్ నాయక్, వెంకటప్ప, మదన్ రెడ్డి, వందన, నవీన్ రెడ్డి, యాదయ్య, నాగయ్య, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని, తరగతికొక టీచరు, గది ఉండాలని, పట్టణీకరణ నేపథ్యంలో పాఠశాలల రీ లొకేషన్ జరగాలని, తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా ఆకర్షణీయమైన పాఠశాలలు, పటిష్టమైన పర్యవేక్షణ, సమర్థవంతమైన బోధన ఉండాలని కోరారు. గురుకులాల్లో శాస్త్రీయ పద్ధతిలో టైం టేబుల్ నిర్ణయించాలని, ఏకరూప పాలన ఏర్పాటు చేయాలని, ఎయిడెడ్ పాఠశాలలను స్వాధీనం చేసుకోవాలని, మోడల్ స్కూల్స్ ను విద్యాశాఖలో విలీనం చేయాలని, గిరిజన పాఠశాలలకు పోస్టులను, కెజిబివి టీచర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని, మెస్ చార్జీలను గురుకులాలతో సమానంగా పెంచాలని కోరారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం స్నాక్స్ ఏర్పాటు చేయాలని కోరారు. డిఈఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయాలని కోరారు. మూడు గంటల పాటు జరిగిన సమావేశంలో క్షేత్రస్థాయి సమస్యలను, అభిప్రాయాలను ఉపాధ్యాయులు వివరించారు.

చివరగా ఆకునూరి మురళి మాట్లాడుతూ విద్యార్థి కేంద్రంగా విద్యా వ్యవస్థ అభివృద్ధి కావాలని, పెద్ద పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచేందుకు, పాఠశాలల అభివృద్ధికి గ్రేడింగ్ ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. కీలక భాగస్వాములైన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించి సిఫారసులు ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.



## మరణశిక్షపై ఏఐ లాయర్‌కు ప్రశ్న వేసిన సీజేఐ చంద్రచూడ్..

### -అవును, మరణశిక్ష భారత్‌లో రాజ్యాంగబద్ధమే.. ఏఐ లాయర్

న్యూఢిల్లీ నవంబర్ 7 : చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఇవాళ ఢిల్లీలో నేషనల్ జుడిషియల్ మ్యూజియంను ప్రారంభించారు. ఆ సమయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు చెందిన లాయర్‌కు ఓ ప్రశ్న వేశారు. ఏఐ లాయర్‌ను ఆయన తన ప్రశ్నతో పరీక్షించారు. భారత్‌లో మరణశిక్ష రాజ్యాంబద్ధమేనా అని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు కృత్రిమ మేధకు చెందిన లాయర్ సమాధానం ఇచ్చారు. అడ్వకేట్ టై కట్టుకుని, కంటి అద్దాలు ధరించిన ఆ ఏఐ లాయర్ మాట్లాడుతూ.. అవును, మరణశిక్ష భారత్‌లో రాజ్యాంగబద్ధమే అని పేర్కొన్నారు. చాలా అరుదైన కేసుల్లో మాత్రమే ఆ శిక్షను ఖరారు చేస్తారని, చాలా హేయమైన నేరాలకు సుప్రీంకోర్టు ఆ శిక్ష వేస్తుందన్నారు. ఏఐ లాయర్ ఇచ్చిన సమాధానంతో సీజే చంద్రచూడ్ ఆశ్చర్యపోయారు. స్మైల్ ఇస్తూ ఆయన అక్కడ నుంచి కదిలారు. సోమవారం నుంచి కొత్త సీజేగా బాధ్యతలు స్వీకరించనున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బెంగాల్ నుంచి కేసు బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ



న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ నుంచి ఆర్ జి కర్ హత్యాచారం కేసు విచారణను బదిలీ చేయడానికి సుప్రీంకోర్టు గురువారం నిరాకరించింది. పశ్చిమ బెంగాల్ నుంచి విచారణను బదిలీ చేయాలని మౌఖికంగా చేసుకున్న వినతిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. కేసు విచారణ బదిలీ చేయడం కుదరదని మౌఖికంగానే తెలిపింది.

కేసు విచారణ సందర్భంగా రాష్ట్రంలో అలజడి వాతావరణం ఉందని, అందుకే బదిలీ చేయాలని ఓ వకీలు కోరారు. అప్పుడు భారత ప్రధాన న్యాయమూర్తి ప్రతిస్పందించి "మణిపుర్ కేసుల వంటి విషయాల్లో అలాగే చేశాము. కానీ ఇప్పుడు అలా చేయబోవడం లేదు. ఎలాంటి బదిలీ ఉండదు" అని స్పష్టం చేశారు.

అప్పుడు వకీలు "బెంగాల్ ప్రజలకు న్యాయవ్యవస్థ, పోలీసుల మీద నమ్మకం పోయింది" అన్నారు. దానికి ప్రధాన న్యాయమూర్తి "ప్రజల గురించి మాట్లాడకండి%ౌ%ఎవరి కోసం మీరు అప్పీరయ్యారు? మీరు ఇలాంటి జనరల్ స్టేట్ మెంట్లు ఇవ్వకూడదు. కోర్టులో క్యాంటీన్ గ్యాసిప్స్ చోటుచేసుకుంటున్నాయి" అన్నారు. మరో లాయరు సిబిఐ సరిగా పరిశోధన జరపలేదన్నారు.

